# ✻ నీతి కథ ✻

వెతకబోయిన తీగ!

ధర్మారావుకు మునిరత్నం తగిలాడు.

మునిరత్నం తగిలాడంటే జలగ పట్టుకున్నట్టే! మునిరత్నం కాళ్ళు ముందుగా నాయర్ హోటల్ వైపు దారితీస్తాయి.

మునిరత్నంకి ఆకలి జాస్తి. ఆకలితోపాటు దాహమూ జాస్తి. ఆకలి అతని కాళ్ళని టీ దుకాణాల వైపు, హోటళ్ళ వైపు నడిపిస్తుంటే దాహం అతని చేతుల్ని బల్లకిందికి జరిపిస్తూ వుంటుంది.

'ఈ రెంటిలోన ఏది కావన్నా - యిన్నాళ్ళ కొచ్చిన జీతం బిల్లు - గుండుసున్న; నిండుసున్న' అని పాట లంకించుకుంటాడు, మునిరత్నం.

అతని పాటలోని అపస్వరాల్ని అనుభవించిన పెద్దమనుషులకేం కొదువలేదు. జీతం బిల్లులో యే లోపమూ లేకుండానే దాఖలు చేసుకున్నా - ఒక కలంతో యే ఆరునో, తొమ్మిదినో - సున్నగా మార్చి, ఇంకో ఎర్ర సిరా కలంతో ఇంపక్స్ - దాని పక్కన ఇంటూ మార్కెట్టి - రెండు పేజీల రిమార్కుతో బిల్లులు త్రిప్పి పంపగల అతి సమర్థుడైన గుమాస్తా - మునిరత్నం.

అందుకే అతను కనిపిస్తే చాలు - ధర్మారావు లాంటి వాళ్ల

కాళ్లు అప్రయత్నంగా; బుద్ధిగా, అతని కాళ్లని అనుసరిస్తాయి.

'ఆఁ పోదూ' అని పెదవి విరిచే అహంకారులుంటే అనక అ
నెలకు వాళ్లింట్లో పొయ్యిలో పిల్లి ముడుచుకు పడుకున్నదన్నమాటే

ధర్మారావు మునిరత్నంని అనుసరించేడు, మునిరత్నం హోట
ల్లోకి చేరేడు.

రెండిడ్లీ, పుప్మా పెసరట్టూ తిని కాఫీ తాగేవరకూ - ముని
రత్నం ఏమీ మాట్లాడలేదు.

ధర్మారావు కాఫీ తాగేడే గానీ ఆయన నాలిక మాత్రం నానా
రకాలైన ప్రశ్నల్ని అడుగుతూనే వుంది.

'ప్రెసిడెంటుగారు రేపు మీటింగేశారటగా' -

'ఈ నెల జీతాలు రావటానికి ఇంకెంత కాలం పడుతుందో'-

'బిల్స్ పాసవుతున్నయ్యా' -

ఇంతలో 'కాష్' దగ్గర కొంచెం హడావిడి జరిగింది.

—'ఇది చాలా దారుణం మాష్టారూ. సరుకు తగ్గించి రేటు
పెంచేస్తున్నారు. పచ్చి ఎక్స్‌ప్లాయిటేషన్. కడుపు రగిలిపోతోంది'
- జీబురు గడ్డమాయన వోహ్ బుసలు కొడుతున్నాడు.

'ఏం చేస్తాం మరి. రోజులలా వున్నయ్. మీరేఁవనుకోనంటే
ఒక్క మాటడుగుతాను' - వోనర్ నోట్లు లెక్కిస్తూ అన్నాడు.

'అడగండి.'

'పని చెయ్యటం పూర్తిగా మానేసి— జీతాలు పెంచమని
ఆందోళన చెయ్యటం కంటే ఇది దారుణమైన ఎక్స్‌ప్లాయిటేషన్
అంటారా?'

జీబురుగడ్డమాయన నీళ్లు నమిలేడు.

ఆ పక్కకి చేరిన మరో రిమ్‌లెస్ కళ్లజోడు అన్నది, 'ఎందుకండీ

C. P. BROWN
MEMORIAL LIBRARY
Acc. No. 1134
Date .

ఈ మాటలూ, ఆర్గ్యుమెంటూ. గుంటెల్లో భోజనరీ సామెత.'

అదోలా చూస్తూ సాగిపోయాడు జీబురుగడ్డమాయన. నాయర్ గారు ముసిముసిగా నవ్వుకున్నాడు.

క్రింది పెదవిమీద అంటుకుపోయిన మీసాల్ని సరిచేసుకుని ఇవతలకి నడిచేడు మునిరత్నం. ధర్మారావూ కదిలేడు.

వెనకనుంచీ కేక వినిపించింది — 'ఒకటీ ఎన్నైభై' అని.

'వీళ్ళకి పది పైసలిస్తున్నామంటే — వీడు కట్టబోయే భవంతికి పది యిటుకలు పేరుస్తున్నామన్నమాట' అంటూ వుండే విశ్వనాధం మాటలు గుర్తుకొచ్చినై ధర్మారావుకు. అతని మాటల్లో హాస్య ధోరణి, అతిశయోక్తి వున్నా — ఆ మాటల వెనకవున్న — కసిత్వం తీవ్రత — ఆయన కిప్పుడు అనుభవంలోకి వచ్చింది.

రెండురూపాయల కాగితం యిచ్చి చిల్లర తీసుకుని బయట పడ్డాడు ధర్మారావు.

మునిరత్నం అప్పటికప్పుడే కిళ్ళీ తీసుకుని బుగ్గన దట్టించాడు. దానికి చెల్లించాల్సిన డబ్బుకోసం ధర్మారావు కేసి చూసేడు.

'అయ్యొయ్యో-అంతకంటేనా — తమ కిళ్ళీ, సిగరెట్ ఖర్చు భరించటంకంటే ఆనందకరమైన విషయం ఇంకేంవుంది!' అన్న ఎక్స్‌ప్రెషనిచ్చి — కిళ్ళీ కొట్లో రూపాయి ఇరవై పైసలిచ్చేడు.

సిగరెట్ వెలిగిస్తూ అన్నాడు మునిరత్నం. "పని చాలా హెవీగా వుంది ధర్మారావ్. బిల్లులు పేమెంటు కొచ్చినప్పుడన్నా ఎవర్నైనా సహాయం యిమ్మంటే — విని వూరుకుంటాడు మేనేజరు. నీకు తెలుసుగా ఆయన తత్వం. రాత్రికి కాస్త మా యింటికిరా. ఇవాళ సెలవేగా. రేపేమో ఆఫీసులో కూర్చుందాం. మీ హెడ్ మాష్టర్‌కి నేనే నిన్ను రమ్మన్నానని చెప్పు — ఫర్వాలేదు."

బడిపంతులికి మునిరత్నం యిచ్చే గౌరవం అతని ఏకవచన ప్రయోగంలో తెలిపోతూ వుంటుంది. అందునా ధర్మారావు లాంటి వాళ్లపట్ల మరీ కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ధర్మారావు వయస్సు ఏభైకి మించితే — మునిరత్నం ముప్ఫైఏళ్లదాటని బ్రహ్మచారి!

ధర్మారావుకు అడపాదడపా ఇదొక యిరకాటం. మునిరత్నం కోరిక తీర్చకపోతే జీతాల బిల్లులు రావు. తీరిస్తే హెడ్‌మాష్టరు సతాయింపు. ఆ బిల్లులో తన జీతం కూడా కలిసేవున్న వాస్తవం హెడ్‌మాష్టరుకు తెలుసు. ధర్మారావు రాత్రింబవళ్లు మునిరత్నం దగ్గర శ్రమపడాల్సి వున్న యదార్థమూ ఆయనకు తెలుసు. అయినా, తన అధికార దర్పాన్ని చూపటానికి - ఏదో వో పని కల్పించి - అది చేసి, తర్వాత యే ఆఫీసుకు పోయినా తనకేమీ అభ్యంతరం లేదని మొహం పక్కకి తిప్పుకుంటాడు హెడ్మాష్టరు.

ధర్మారావు ఆలోచనలోంచి తేరుకునే లోగానే "వస్తా .... పది గంటలకల్లా వచ్చేయ్" అంటూ గబగబా అడుగులు వేస్తూ ముందుకు నడవసాగేడు మునిరత్నం.

ధర్మారావుకు అసలు పని గుర్తుకొచ్చింది. చిన్నగా పరుగెత్తు తున్నట్టు నడిచి మునిరత్నం పక్కకి వచ్చేడు.

"నా పి. యఫ్. లోను కిందటి నెలతో పూర్తిగా తీరిపోయింది సార్. జీతం బిల్లులో ఈ నెల కట్ కాకుండా చూడాలి."

"అరెరె మీ బిల్లు పాస్ చేశానే" - గొప్పగా ఫీలయ్యాడు.

"దాన్ని సరిచేయటానికి .... " ధర్మారావు నసిగేడు.

"నా .... నా .... నో - పాసైన బిల్లుని యింకేం సరిచేస్తాం. పైగా సంతకాలైపోయినై."

"అయితే.... కొంచెం రిఫండిప్పించాలి...."

"చూద్దాం. కానీ.... టైమ్ పడుతుంది. రాజధానికి రాసి కనుక్కోవాలి."

"ప్లీజ్— మీ రెలాగైనా హెల్ప్ చెయ్యాలి."

"అఁ .... ఏం 'హెల్ప్' చెయ్యగలమో, మాకు హెల్ప్ చేసే వాళ్లెవరూ కనిపించటం లేదు. నేనేం చెప్పలేను మరి. చూద్దాం."

"అలా అనకండి ఈ ఫైలు వుంచండి." నోటు చేతులు మారింది. "సరె .... కానీయ్. బిల్లుతోపాటు ఆ రిఫండు కూడా తీసుకో...."

మునిరత్నం సాగిపోయాడు.

ధర్మారావ్ గాలి పీల్చుకున్నాడు.

కానీ, కసిగా వుంది. మనసు చెడిపోయింది. రాత్రికీ, రేపూ, మునిరత్నం కొలువు తప్పదు.

ధర్మారావ్ అప్రయత్నంగా జేబులు తడుముకున్నాడు.. చిల్లర మిగిలింది. ఇంట్లో అవసరాలు కళ్ళముందు మెదిలినై. ఎంతలేదన్నా రెండురోజులు పడుతుంది—జీతాలు రావాలంటే.

"ఏఁవిటీ దీర్ఘాలోచన చేస్తూ వస్తున్నారు?"

విశ్వనాథం!

ధర్మారావు పేలవంగా నవ్వేడు. 'మనస్సు బావులేనప్పుడు ఉతికి ఆరేసుకోవాలి మాష్టారూ. రండి సినిమాకు పోదాం."

పక్కరోడ్డులోనే సినిమా హాలు. విశ్వనాథం ఆగేడు.

"లేదులే, నేను రాలేను. ఈ రాత్రికి మునిరత్నం రమ్మన్నాడు. వెళ్ళాలి. నువ్వు నడు." అంటూ తను ముందుకు నడిచేడు ధర్మారావు.

"అచ్ఛా .... వస్తాను మరి. కొత్త సినిమా. ఆలశ్యమైతే టిక్కెట్లుండవ్" అంటూ వెళ్ళిపోయాడు విశ్వనాథం.

"పాతికేళ్ళ క్రితం నేనూ నీలానే వుండేవాణ్ణి విశ్వనాథం" అని

అతన్ని పిలిచి చెప్పాలనిపించింది ధర్మారావుకు. అవును, అది ధర్మారావు తప్పుకాదు— అతని మనస్సులో కసి ప్రభావం.

కసితోనూ, కసి కలిగించిన ఆలోచనతోనూ సెంటర్ చుట్టూ ఆరు మైళ్ళు తిరిగేడు ధర్మారావు. ఇంటికి పోవాలనిపించటంలేదు. అప్పటి కప్పుడే ఎనిమిది దాటింది.

బ్రహ్మంగారు గుర్తుకొచ్చారు ధర్మారావుకు. ఆయన యింటికేసి నడక సాగించాడు.

రెండేళ్ళ క్రితం ధర్మారావుకు వో దుర్బుద్ధి పుట్టింది. ప్రైవేటుగా ఎమ్మే చదువుకుందామని. తెలుగు భాషాభిమానం ముదిరి తెలుగులో ఎమ్మే పట్టం పుచ్చుకోవాలనే అభిలాష కలిగింది. పండగ అడ్వాన్స్ పెట్టి ఫీజులు కట్టేశాడు.

తను హిందీలో బియ్యే చదివేడనీ, అందువలన తెలుగు ఎమ్మే చదివేందుకు అర్హతలేదనీ — పరీక్షకి రావటానికి వీల్లేదన్నారు. చెల్లించిన సొమ్ము తిరిగి పంపిస్తామనీ ఆశ పెట్టారు.

అదుగో, ఆ ఆశ — యివాల్టి దాకా అప్పుడప్పుడూ గుర్తు కొస్తోంది. ఆశతోపాటు బ్రహ్మంగారూ గుర్తుకొస్తారు. ఆయన వెయ్యి ఆఫీసుల పూజారి. "ఇలాంటి పనులు దస్తరంలో పెట్టుకుని తడనకో వూరు 'క్యాంప్'కు వెళ్తూ వుంటారు. అలా వెళ్ళినప్పుడు నీ పని చేసేసుకొస్తారు. ఆయనకి చెప్పు"మని వోసారి విశ్వనాథం సలహా యిచ్చాడు ధర్మారావుకు. ధర్మారావు అలాగే తన కథ బ్రహ్మం గారికి నివేదించుకున్నాడు. యిది జరిగీ ఏడాది దాటింది. డబ్బు మాత్రం చేతికి రాలేదు.

ధర్మారావు వెళ్ళేసరికి బ్రహ్మంగారు ఎవరో పెద్దమనిషితో మాట్లాడుతున్నారు. దణ్ణంపెట్టి బల్లమీద కూర్చుని వాళ్ళ సంభాషణ

వినసాగేడు ధర్మారావు.

"అసలో గొట్టంలా అర్థమైతే ఆఫీసులు తిరిగితేగానీ పనితేలదు. అయినా యింత బారం మొయ్యటం నావల్ల కాదండి" — బ్రహ్మం గారు తల తాటింపాడు.

"తమలాంటివారు అలాగంటే ఎలా? మీకు ప్రభుత్వంలో ఎంత పలుకుబడి వుందో నాకు తెలియనిదికాదు. మీరే ఈ సహాయం చేసి వో యిల్లు నిలబెట్ట గలిగిన సమర్థులు."

"నేను వెయ్యి గుళ్ళ పూజారిని. చూస్తుంటిరిగా. క్షణం తీరికలేదు. దమ్మిడీ ఆదాయం లేదు. నన్నిబ్బంది పెట్టకండి రాజు గారూ!"

"చిత్తం. అవసరమైతే వో వెయ్యిదాకా ఖర్చు పెడదాం. రేపే తెచ్చిస్తాను మీకు. ఎలాగో మీరీ భారం వహించాలి. వాణ్ణో ఉద్యోగంలో పడెయ్యాలి" రాజుగారు ప్రాధేయపడ్డారు.

కొయ్యకుర్చీ చేతిమీద మునివేళ్ళతో దరువేస్తూ వుండిపోయారు బ్రహ్మంగారు.

క్షణాల తరువాత "సరే కానివ్వండి. ఆదివారం రాత్రి బస్సుకు టిక్కెట్లు కొనండి. ఆ కుర్రాణ్ణికూడా పంపించండి. మీమాట కాదనలేను మరి" అని ధర్మారావు వైపు సాలోచనగా చూసేరు.

'అయితే నా విషయం గుర్తు లేదన్న మాట' అనుకున్నాడు ధర్మారావు.

ఆ పెద్దమనిషి వెళ్ళిపోయాడు.

"నా పరీక్ష బాపతు డబ్బు ఇంకా" —

"ఓహో. అదా గుర్తు కొచ్చింది. అవునూ ఏడాది దాటింది గదా— ఇంకా రాలేదా?"

"రాలేదండీ"

"గట్టిగా చెప్పొచ్చానయ్యా క్రితంసారి" అని "సర్లే ఈసారి వెళ్ళినప్పుడు కూర్చుని పని చేయించుకొస్తాన్లే" అన్నాడు.

క్షణాల క్రితం ఆ పెద్దమనిషితో బ్రహ్మంగారు వ్యవహారాన్ని ఎలా 'డీల్' చేశాడో స్ఫురించింది ధర్మారావుకు. చటుక్కున అనేశాడు. "అక్కడ ఆఫీసులో ఏమన్నా ఖర్చుంటే — నేను భరించుకుంటాను. మీరు ఎలాగైనా...." నాన్చేడు.

"అలాగే .... దానికేం గానీ — ఈసారి నీ పని పూర్తి చేసుకొచ్చే పూచీ నాది.... సరేనా" అని లేచారు బ్రహ్మంగారు.

థాంక్స్ చెప్పి వచ్చేశాడు ధర్మారావు.

— రెండు రోజుల తర్వాత,

పరంధామయ్య ధర్మారావుని పిలిపించాడు.

పరంధామయ్య ప్రెసిడెంటు.

ధర్మారావు వెళ్ళేసరికి పరంధామయ్య ఏదో రాచకార్యంలో వున్నాడు. వరండాలో బల్లమీద కూర్చున్నాడు, ధర్మారావు.

పరంధామయ్య ఫోనులో మాట్లాడుతున్నాడు. ధర్మారావుకు మాటలు వినిపిస్తున్నై.

"రాజారావుగారూ, వచ్చే శనివారం తిరపతి పోదామని డిసైడ్ చేసుకున్నామండీ' — "..............."

'అవును .... ఫామిలీతోనే వెళ్ళాలి. మా సంసారం, సంతానం మీకు తెలుసుగా. బస్సుల్లో, రైళ్ళల్లో పడి చావలేము. అందుకని టాక్సీలో పోదామనుకుంటున్నాం -"

'...............'

'ఆఁ.... సుఖమనే అలా అనుకుంది. ఎవరన్నా మీకు తెలిసిన

డ్రైవర్‌ని చూసి మాట్లాడి పెట్టాలి' -

'..........'

'ఆఁ. అవునూ మర్చేపోయాను. అమ్మాయి టైపిస్టు పోస్టుకి అప్లై చేసిందన్నారుకదూ!'

'..............'

'రేపు తీసుకురండి. టెంపరరీగా వేయిద్దాం.'

'..............'

'ఆఁ — అలాగే. థాంక్స్.'

పరంధామయ్యగారు హడావుడిగా బయటికి వచ్చారు. ధర్మారావు లేచి నిలబడి నమస్కరించాడు.

'ఆఁ. ఏవండీ నిన్న మీటింగుకు రాలేదు.' అని ధర్మారావు జవాబు చెప్పే లోగానే, 'సరే, ఎన్నికలకి నాకో కోటా తగిలించాడు వీరయ్య. మన వాళ్ళందర్నీ ఈ నెల జీతాల్లో తలా ఓ యాభై యిమ్మని చెప్పాను. మీరూ మన నీలకంఠంకి సాయంగా వుండి కలెక్షన్ సంగతి చూడండి' అని గబగబా వెళ్ళిపోయాడు.

ధర్మారావూ కదిలాడు.

నీలకంఠం యూనియన్ కార్యదర్శి. ఏ వివరాలూ అడిగేందుకు వీలులేకుండా పెత్తనం చలాయించే మనిషి నీలకంఠం. తాను పొడి పొడిగా మాట్లాడుతూ, ఎదుటి వాడేమైనా మాట్లాడితే — ఆ మాటల కార్బన్ కాపీని పరంధామయ్యగారి ముందుంచుతూ వుంటాడని చెప్తూవుంటారు, చాలామంది. ఆయన నైజం ఇదీ అని అందరికీ తెలిసినా - యూనియన్‌కి మాత్రం ఆయనే కార్యదర్శిగా ఎన్నికవుతూ వుండటంలో ఓ కీలకం వుంది. పరంధామయ్యగారి హుకుమే ఆ కీలకానికి మూలమని చాలామంది అంతరాత్మలకి తెలుసు.

ధర్మారావు ఆలోచన జీతం అంకెల మీదికి మళ్ళింది. దాన్లో నుంచీ య్యాభై కట్‌చేసి చూసుకున్నాడు. ఏదో గొణుక్కున్నాడు. రాబోయే సంక్రాంతి పండగ కళ్ళముందు కదిలింది.

- మర్నాడు,

బిల్లు మార్చుకోవటానికి వెళ్ళాడు ధర్మారావు.

మూడు గంటలైంది.

'నాదో బిల్లుంది - కాస్త చూస్తావ్?'. కూర్చుని కూర్చుని ప్రాణం విసుగెత్తి అడిగేడు.

'చూస్తానుండండి. గుక్క తిప్పుకోటానికీ ఊపిరి పీల్చటానికీ టైమ్ లేదు. వెధవ్వుద్యోగం.'

'నే వచ్చి చాలా సేపైంది - అందుకని ....'

'అట్టాగే లెండి. అవునూ మీ నెంబరెంత?'

చెప్పేడు.

'తమరి పండగ మామూలు?'

'మీకు పండగ మామూలేఁవిటండీ? మా జీతాలకి మూడురెట్లు మీ జీతాలు.' తెగించి అడిగేశాడు ధర్మారావు.

'ఆఁ. జీతానికేంలెండి. రొయ్యకు లేదా బారెడు మీసం అన్నట్టు చాలా వుంది. ఏదెట్టా ఏడిచినా జవాను జఁవానేగా? ఏఁవంటారు?'

'అనేందుకేం వుంది. నువ్వింత వివరణ యిచ్చిన తర్వాత యివ్వక ఛస్తామా కానీ ....'

జేబులోనుంచీ రూపాయినోటు తీసిచ్చాడు ధర్మారావు.

'మీక నెలనెలా జీతాలకొచ్చే కష్టమర్స్ గదా. మీరూ రూపాయేనా? మరో రూపాయివ్వండి.'

కొరకొర చూస్తూ మరో రూపాయి యిచ్చాడు ధర్మారావు.

డబ్బు తీసుకుని బయటికి రాగానే చెట్టు కింద ఎదురైనాడు నీలకంఠం.

అతను చాలా బిజీగా వున్నాడు - కలెక్షన్ల హడావిడి!

ఐదు పది నోట్లు నీలకంఠం కిచ్చాడు ధర్మారావు. అతను వాటిని తీసి జేబులో కుక్కున్నాడు. 'మరో పదివ్వండి.' అడిగేడు.

ఎందుకన్నట్లు చూసేడు ధర్మారావు.

'ఆఫీసరుగారింట్లో గృహప్రవేశం. మనమంతా కలిసి ఓ 'సోఫా-కమ్-బెడ్' బహూకరిద్దామని తీర్మానించాం.' చెప్పేడు.

'నాకు తెలియదులెండి' అన్నాడు ధర్మారావు.

'మీటింగులకి రారు. అక్కడ జరిగే నిర్ణయాలెలా తెలుస్తాయ్ మరి.'- ఇదో సూటి పోటి మాట! వదిలేది వదులుతుంది, తప్పదు.

పది కాగితం ఇచ్చి రెండడుగులు వేశాడు.

చేతిలో మిగిలిన డబ్బు లెఖ్ఖ చూసుకున్నాడు ధర్మారావు. నూట అర్వైఏనిమిది! 'ఇంతకీ నా జీతమెంత అసలు?' అనిపించి, అదే గొణుక్కున్నాడు.

'అవినీతికి వ్యతిరేకంగా ఆందోళనట. ఆ ఆందోళనకు వ్యతిరేకంగా ఆందోళనట. అంటే — దీని భావమేమిటోయ్?' చెట్టు కింద ఎవరో పేపరు చదువుతూ సందేహం వెలిబుచ్చుతున్నారు.

ధర్మారావు పెదవుల మీద చిరునవ్వు కదిలింది.

ఎండీఎండని తాటిమొవ్వలా వుందది.

మునిరత్నం, నాయర్, బ్రహ్మంగారు, రాజుగారు, పరంధామయ్య, నీలకంఠం, జవాను, ఆఫీసరు, తాను— అంతా ఒకే తానులో ముక్కలు!

ధర్మారావుకు చిన్నప్పుడెప్పుడో వాళ్ళ అమ్మమ్మ చెప్పిన నీతి గుర్తుకొచ్చింది—

'విత్తు ఒకటి నాటి మొక్క మరోటి కావాలనీ, పండు వేరొకటి కావాలనీ కోరుకుంటే— దొరకదుగాక, దొరకదురా పిచ్చి సన్నాసి!!'

అవును, అందుకని ఇప్పుడిక విత్తునే కుళ్ళగించి తీసి మాడ్చి అవతల పారెయ్యడానికి ప్రయత్నించాలి. జాతికి నవజీవం సమకూర్చాలి!

❋ ❋ ❋